క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇల్లంతకుంట: పేదల వైద్యానికి అండగా సీఎం ఆర్ నిధులు పని చేస్తున్నాయని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు అంతగిరి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రహీంఖాన్‌పేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నాగుల భాగ్యలక్ష్మి, కమటం రజిత, డి.జయంతి, కత్తి రవి, హరిత కుటుంబాలకు రూ.1.52లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. దాచారం గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ కొమ్ముల నర్సింగ్గం గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి బంటు రజిత, దరిపెల్లి మల్లయ్య, కుటుంబాలకు రూ.66వేల చెక్కులు అందజేశారు. బత్తిని మల్లయ్య, నారాయణ, దొంతి మల్లయ్య, అంజయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి మిత్రుల ఔదార్యం



మృతుడి కుటుంబానికి డిపాజిట్ పత్రం అందజేస్తున్న స్నేహితులు

చందుర్తి: పదోతరగతి వరకు కలిసి చదువుకున్న మిత్రుడు అనారోగ్యం బారిన పడి మరణించగా.. అతడి కుటుంబానికి మిత్రులు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించి ఔదార్యం చాటుకున్నారు. జోగాపూర్ ఆమ్లేట్ గ్రామమైన గుడిపేట గ్రామానికి చెందిన గరుడ మహేశ్ మూడు మాసాల క్రితం మృతిచెందాడు. మల్యాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న స్నేహితులు అతడి పిల్లల పేరిట రూ.35వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి డిపాజిట్ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

మహాసభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

వేములవాడఅర్బన్: చీర్లవంచ గ్రామంలో భవన నిర్మాణ సుతారి, కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈనెల 21న జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా 3వ మహాసభ కరపత్రం ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ.. 55 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5వేలు పెన్షన్ అందించాలన్నారు. గ్రామ సంఘం అధ్యక్షుడు లచ్చయ్య, అంజయ్య, మల్లేశం, రామస్వామి, నాగరాజు, మోహన్, వెంకటేశం, శ్రీనివాస్, రవీందర్ తదితరులున్నారు.

సర్వే పేరిట కాలయాపన

చందుర్తి: అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం సర్వేల పేరిట కాలయాపన చేస్తోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు.

రెడ్డిల సంక్షేమమే లక్ష్యం



రాజన్నపేటలో కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో రెడ్డి సంక్షేమ సంఘాలను బలోపేతం చేస్తూ.. వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తానని జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన కృష్ణారెడ్డిని ఆదివారం రాజన్నపేట, రాచర్లగొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్, బండలింగంపల్లి గ్రామాల్లో సన్మానించారు. సంఘం ప్రతినిధులు శివారెడ్డి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నర్సింహరెడ్డి, పాశం దేవారెడ్డి, మాజీ సర్పంచ్ పాశం సరోజన తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు



బహుమతులు అందిస్తున్న బాలాజీ

కోనరావుపేట: ధర్మారంలో మండలస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. యువకులు మొబైల్ ఫోన్లు వదిలి మైదానానికి రావడం సంతోషకరమన్నారు. ఆర్గనైజర్లు అన్నబోయిన సన్నీ, కౌశిక్, శివసాయి, స్వాగత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలో విద్యార్థులు




వీర్నపల్లి: మండల కేంద్రంలోని పీఎంశ్రీ మండల పరిషత్ విద్యార్థులను ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో ఆదివారం విహార యాత్రకు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లోని సాలర్‌జంగ్ మ్యూజియం, నెహ్రూ జూపార్క్ చూశారు. ఉపాధ్యాయులు వారికి వివరించారు. హెడ్ మాస్టర్ ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

కార్యాలయానికి దారి ఇలా..



ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయానికి దారి సక్రమంగా లేకపోవడంతో కార్యాలయానికి వెళ్లే రైతులు అవస్థలు పడుతున్నారు. గుంతలమయంగా ఉండడంతోపాటు కార్యాలయం చుట్టూ రాళ్ల కుప్పలుండడంతో కార్యాలయం చుట్టూ అస్తవ్యస్తంగా కనబడుతోంది. కుమ్మరి కుంటను ఆనుకొని ఉండడంతో వర్షాకాలంలో కుంటలోకి నీరు చేరితే వ్యవసాయ కార్యాలయం చుట్టుపక్కల మొత్తం నీరు చేరి కార్యాలయంలోకి వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంటోంది.

లైసెన్స్ ఉంటేనే బైక్ నడపాలి



వీర్నపల్లి: మండల కేంద్రంలో హెడ్ కానిస్టేబుల్ బాబు ఆధ్వర్యంలో పోలీస్ కమ్యూనిటీ మొబలైజేషన్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనం నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, మైనర్ డ్రైవింగ్‌పై నిఘా కఠినం చేశామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు



రోడ్డుపై వాహనం ఆగితే మరో వాహనం వెళ్లలేని పరిస్థితి



దుకాణం ఎదుట వాహనం ఆగితే మరో వాహనం వెళ్లలేని వైనం

- ఇల్లంతకుంట మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ ఎప్పుడో..?
- సింగిల్ రోడ్డుపై డివైడర్లు వేసి.. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న అధికారులు

ఇల్లంతకుంట: రోడ్డు విస్తరణ కోసం మండల కేంద్రంలో సింగిల్ రోడ్డుపై డివైడర్ వేసి రోడ్డు విస్తరణ చేయకపోవడంతో.. మండల కేంద్రంలో వాహనాల రాకపోకలకు ప్రతిరోజు ఇబ్బందికరంగా తయారయింది. మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా మూడు సంవత్సరాల క్రితం రూ.1.35కోట్లతో సింగిల్ రోడ్డుపై డివైడర్లు వేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇల్లంతకుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపం నుంచి బస్టాండ్ మీదుగా బైపాస్‌లోని ఎస్సీకాలనీ వరకు డివైడర్లు వేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. 69 సెంట్రల్ లైటింగ్ స్తంభాలు డివైడర్ల మధ్య ఏర్పాటు చేసి లైటింగ్ అమర్చారు. వివేకానంద చౌరస్తా నుంచి ఎస్సీకాలనీ వరకు డివైడర్ల మధ్యనున్న రోడ్డు లోతట్టుగా తయారై వర్షం పడితే నీరు నిల్వ ఉండి వాహనాలు వెళ్లినప్పుడు మురుగు నీరు రోడ్డు పక్కనున్న దుకాణాల్లో పడుతోంది. రోడ్డు ఇరుగ్గా ఉండడంతో దుకాణం ముందు వాహనం ఆగితే మరో వాహనం పోవడానికి వీల్లేకుండా ఉంటోంది. ప్రతిరోజు వాహనాల సైరన్లు మోగుతూనే ఉంటాయి. బస్టాండ్ సమీపంలో ఉన్న వ్యాపార సముదాయాల వద్ద లోడ్ వాహనాలు అన్లోడ్ కోసం ఆగితే అంతే సంగతులు. వాహనాలు రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తోంది. సిరిసిల్ల, కరీంనగర్ బస్సులకు నిత్యం హారన్లు కొట్టడం తప్పడం లేదు. ఈ సమస్య ఎప్పుడు తీరుతుందని మండల ప్రజలు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ కోసం ఇల్లంతకుంట గ్రామ పంచాయతీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. డివైడర్ల నుంచి ఇరువైపులా 23 ఫీట్ల వరకు నిర్ణయిస్తూ గ్రామస్తులు నిర్ణయం తీసుకున్నారు. మార్కింగ్ కూడా ఇచ్చారు. కొంతమంది మార్కింగ్ ఇచ్చిన వరకు చూసుకొని తమ షాపులను కూలగొట్టి మళ్లీ నిర్మించుకున్నారు. మరికొంతమంది రోడ్డు విస్తరణయినప్పుడు చూద్దాంలే ఊరుకున్నారు. దాంతో రోడ్డు విస్తరణ సమస్య సమస్యగానే మారి నిత్యం వాహనాల రాకపోకలు, సైరన్లతో మండల ప్రజలకు ఇబ్బందికరంగా తయారయింది.

డివైడర్లను తొలగించండి



ఇల్లంతకుంట మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ కోసం డివైడర్లు వేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. డివైడర్లను తొలగించండి.. లేకుంటే రోడ్డు విస్తరణ అయినా చేపట్టండి. ప్రభుత్వ అధికారులు వెంటనే రోడ్డు విస్తరణ చేస్తే బాగుంటుంది.

– గొడుగు నరసయ్య, ఇల్లంతకుంట



ముస్తాబాద్: తుర్కపల్లిలో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. కుక్కలు వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. దారి వెంట వెళ్లేవారిలో పలువురిని గాయపరుస్తాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా కుక్కల బెడద నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులంటున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
పర్శరాములు, పంచాయతీ కార్యదర్శి, సెల్ నంబర్: 9642166144

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

బీజేపీ సంబరాలు



సిరిసిల్ల గాంధీచౌక్‌లో సంబరాల్లో బీజేపీ నాయకులు



తంగళ్లపల్లిలో బీజేపీ నాయకులు

సిరిసిల్ల: ఢిల్లీలో ఎన్నికల ఫలితాలపై సిరిసిల్ల బీజేపీ నాయకులు ఆదివారం సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్, పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి బర్కం నవీన్‌యాదవ్, పట్టణ ఉపాధ్యక్షుడు చొప్పదండి అంజన్న, నాయకులు ఊరగొండ రాజు, మోర శ్రీహరి, పంపరి అర్జున్, కోశాధికారి చొప్పదండి శ్రీనివాస్, వంగ అనిల్, గాజుల వేణు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఢిల్లీ అంసెబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ ఎమ్మెల్యే సీట్లు గెలవగా.. ఆదివారం మండల కేంద్రంలో నాయకులు సంబరాలు జరిపారు. మండెపల్లి చౌరస్తా వద్ద టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, సీనియర్ నాయకులు గజభీంకార్ సంతోష్, లింగారెడ్డి, కాశిచరణ్, వంశీ, సందవేని రాజుయాదవ్, నరేశ్, ప్రకాశ్, సాయి పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం వేములవాడ నంది కమాన్ వద్ద నాయకులు విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. లింగంపల్లి శంకర్, ఏరెడ్డి రాజిరెడ్డి, గొనె భాస్కర్, చంద్రగిరి ప్రశాంత్, సంతోష్, రమేశ్, నర్సయ్య తదితరులున్నారు.

కోనరావుపేట: మరిమడ్లలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కుమ్మరి దిలీప్‌కుమార్, మాట్ల రమేశ్, గడుకోల్ రాజు, మాజీ ఎంపీటీసీ రేణుక, బొల్లం శ్రీనివాస్, పుల్కం ప్రశాంత్, దేవనర్సయ్య, చేతన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న రమేశ్

బోయినపల్లి: మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేశ్ అన్నారు. నీలోజిపల్లి సీపీఎం గ్రామ శాఖ సమావేశం ఆదివారం మండల కార్యదర్శి గురజాల శ్రీదర్ అధ్యక్షతన జరిగింది. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులు ఎలాంటి ఉపాధి లేక అనేక ఇబ్బందులు పడుతున్న వైనాన్ని వారి ఇళ్లకు వెళ్లి చూసినట్లు తెలిపారు. సీపీఎం నాయకులు ఎర్ర నాగరాజు, సింగిరెడ్డి శంకర్, ఆవుల మల్లయ్య, అనుముల రవి, ఆవుల రాములు, వెంకటరెడ్డి, లింబాద్రి, కడుదుల రవి తదితరులున్నారు.

జెర్సీలు అందజేత



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని క్రికెట్ క్రీడాకారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆదివారం టీమ్ టోని పేరుతో జెర్సీలు పంపిణీ చేశారు. నాయకులు లింగాల భూపతి, పెద్దూరి తిరుపతి, మచ్చ శ్రీనివాస్, మోర రాజు, సామల గణేశ్, రాపెల్లి ఆనందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజేశ్వర్‌రావుకాలనీలో కరెంట్ కష్టాలు

సిరిసిల్ల: గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావు కాలనీలో 'కరెంట్' కష్టాలు వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్ని రోజులుగా గ్రామంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను తొలగించే పేరుతో గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని స్థానికులు వాపోయారు. కొత్త స్తంభాలు వేస్తున్నట్లు పేర్కొంటూ.. మరికొన్ని రోజులు కరెంట్ సరఫరా చేయడం లేదని వివరించారు. రాజేశ్వర్‌రావుకాలనీలో కరెంట్ సరిగా లేక విద్యార్థులు, యువకులు ఇబ్బందులు పడుతున్నారు. 'సెస్' అధికారులు వెంటనే స్పందించి కరెంట్ సరఫరాలో రోజుల తరబడి జరుగుతున్న అంతరాయాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రక్తదానం



రక్తదానం చేస్తున్న మహేశ్

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన ద్యాగం మహేశ్ అనే యువకుడు ఆదివారం రక్తదానం చేశాడు. సిరిసిల్ల ఏరియాసుపత్రిలో శస్త్ర చికిత్స చేసిన మహిళలకు అత్యవసరంగా రక్తం అవసరముండగా.. విషయం తెలుసుకున్న మహేశ్ ఆస్పత్రికెళ్లి రక్తదానం చేశాడు.

పట్టభద్రులకు అండగా నిలుస్తా



మాట్లాడుతున్న శేఖర్‌రావు

సిరిసిల్లకల్చరల్: పట్టభద్రులతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు అండగా నిలుస్తానని ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక పద్మనాయక కల్యాణ మండపంలో పట్టభద్రులు, ప్రైవేట్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతోపాటు తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి దశాబ్దకాలానికి పైగా కృషి చేశానన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వాహకులు సంఘం(ట్రస్మా) జిల్లా, పట్టణ శాఖల అధ్యక్షులు నాగుల శ్రీనివాస్, ఎల్లె శ్రీనివాస్, బూర శ్రీనివాస్, ఇతర ప్రతినిధులు శ్రీగాధ వేణు, ఎండి లతీఫ్, రాధాకృష్ణమాచారి, కొక్కుల శ్రీనివాస్, పల్లె రాజురెడ్డి, బుచ్చారావు, వివిధ ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువశక్తి అనుకుంటే ఏదైనా సాధ్యమే..



ముస్తాబాద్‌లో ప్రచారం చేస్తున్న ప్రొఫెసర్ కృష్ణారెడ్డి

ముస్తాబాద్: యువశక్తి అనుకుంటే ఏదైనా సాధ్యమేనని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి అన్నారు. మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రచారాన్ని ఆదివారం నిర్వహించారు. ఓయూలో విద్యార్థి నాయకుడిగా, మెస్ సెక్రటరీగా, ప్రొఫెసర్‌గా వేలాది మంది విద్యార్థులకు సేవ చేశానన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు వి.చంద్రం, ఎల్లమ్మల లక్ష్మణ్, మాజీ సర్పంచ్ తిరుపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, పొన్నాల రామచంద్రారెడ్డి, రాంరెడ్డి, నర్సింహారెడ్డి, రఘువీర్‌రెడ్డి, చంద్రం, మహేందర్‌రెడ్డి, గజభీంకార్ బాలరాజు, తుమ్మ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బు సంచులతో వస్తున్న వారిని నిలువరిద్దాం

ఎల్లారెడ్డిపేట: టీచర్ ఎమ్మెల్సీగా రిటైర్డ్ టీచర్ వై.అశోక్‌కుమార్‌ను గెలిపిస్తే ఉపాధ్యాయుల గొంతుకగా నిలుస్తాడని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ప్రచారంలో మాట్లాడారు. డబ్బు సంచులతో వస్తున్న వారిని నిలువరిద్దామన్నారు. ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి, నాయకులు దబ్బెడ హనుమాండ్లు, చకినాల రామచంద్రం, కదిరే శ్రీనివాస్, మల్లికార్జున్, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం, ప్రజలకు వారధిగా పాత్రికేయులు



జ్యోతి వెలిగిస్తున్న విప్ శ్రీనివాస్, చిత్రంలో అల్లం నారాయణ తదితరులు

వేములవాడ: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు పాత్రికేయులు వారధులుగా పని చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మహదేవ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(హెచ్–143) కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశంలోనే ఫోర్త్ ఎస్టేట్‌గా మీడియా రంగం ఉందన్నారు. నా రాజకీయ జీవితంలో పాత్రికేయుల పాత్ర మరువలేనిదని అన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రఫీక్, జగిత్యాల, కరీంనగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జర్నలిస్టులు పాల్గొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా లాయక్‌పాష ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్ ప్రకటించారు. లాయక్‌పాష మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు జిల్లా అధ్యక్షుడిగా గోపాలకృష్ణ



గోపాలకృష్ణను అభినందిస్తున్న అల్లం నారాయణ

వేములవాడ: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా చెరుకు గోపాలకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేములవాడలో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభలో ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ సారథ్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా విప్ శ్రీనివాస్ పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లాకి నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెరకు గోపాలకృష్ణ, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా ఉపాధ్యక్షుడిగా చేపూరి వేణుగోపాలరావు, జిల్లా జనరల్ సెక్రటరీగా బోనాల తిరుమల్, కోశాధికారిగా జెర్రిపోతుల సంపత్ ఎన్నికయ్యారు.

సిరిసిల్ల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా అగ్గిరాములు



అగ్గిరాములును అభినందిస్తున్న నాయకులు

సిరిసిల్ల: మున్నూరు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడిగా వొజ్జెల అగ్గిరాములును ఆదివారం ఎన్నుకున్నారు. మున్నూరు కాపు సంఘం పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు నీలి శంకర్, గడ్డం నర్సయ్య, బొప్ప దేవయ్య, కల్లూరి రాజు, ఎరుకల సూర్యప్రకాశ్ సమక్షంలో కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కుల్ల సత్తయ్య, దుమాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఇప్పపూల లక్ష్మణ్, కోశాధికారిగా అయిలి శ్రీనివాస్, సహాయ కోశాధికారిగా తోట శంకర్, సహాయ కార్యదర్శిగా కొడిమ్యాల వేణుగోపాల్, కార్యనిర్వహణ కార్యదర్శిగా చల్ల రవీందర్, సంయుక్త కార్యదర్శిగా బత్తుల భూమేశ్, కార్యవర్గ సభ్యులుగా శీలం రాజు, లింగంపల్లి సతీశ్, పల్లికొండ నరసయ్య, సోక్కి శ్రీనివాస్, కాశెట్టి పరశురాములు, ఇప్పపూల రాజు, కుస మహేశ్, బల్యాల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాస్

వేములవాడ: ఓల్డ్ అర్బన్‌కాలనీకి చెందిన దూలం శ్రీనివాస్(38) ఆదివారం ఉదయం 11 గంటల నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ ఆదివారం రాత్రి తెలిపారు. వ్యక్తి తన వ్యక్తిగత కారణాలతో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదని పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ లేదా 100 డయల్ చేసి చెప్పాలని అన్నారు. 9908556078 నంబర్‌కు సమాచారం తెలియజేయాలన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం వాయిదా

ఎల్లారెడ్డిపేట: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఈనెల 10న నిర్వహించాల్సి ఉండగా.. జిల్లా వైద్యాధికారిణి రజిత ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు మండల వైద్యాధికారిణి సారియా అంజుమ్ ఆదివారం తెలిపారు.